ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం 14 జనవరి 2025


రాపల్లికోట శివారులో పత్తిపంట

పంట చేతికొచ్చాకే పనులు చేపట్టండి
చిన్నకాళేశ్వరం భూనిర్వాసిత రైతులు

వివరాలు 8వ పేజీలో...


పతంగులను ఎగురవేస్తున్న బాలలు

సంక్రాంతి వచ్చింది.. సంబరాలు తెచ్చింది

- వాడవాడలా పండుగ సందడి
- ఘనంగా భోగి వేడుకలు
- నేడు సంక్రాంతి
- ఊరూరా పర్వదిన శోభ
- రంగవల్లులతో మెరిసిన లోగిళ్లు
- ఆకాశాన ఎగిరిన పతంగులు

భూపాలపల్లిటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఊరూరా సందడి నెలకొంది. వాడవాడలా సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. సోమవారం భోగి పండుగ చేసుకున్న జనం.. మంగళవారం మకర సంక్రాంతిని నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. పంట చేతికి వచ్చిన నేపథ్యంలో బంధువులను, స్నేహితులను పలువురు ఇంటికి ఆహ్వానించుకున్నారు. భోగి పండుగ సందర్భంగా ఇంటిముందు కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేశారు. ముగ్గులో ఆవు పేడతో గొబ్బిళ్లను తయారుచేసి అందులో రేగుపండ్లు పెట్టి, నవధాన్యాలను చల్లారు. ఈ పండుగ సందర్భంగా ఎక్కడెక్కడి వారంతా కుటుంబసమేతంగా తమ తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. సంక్రాంతి పండుగను ఎక్కువగా తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో జరుపుకుంటారు. ఈ నెలలోనే వేసిన పంట చేతికి వస్తుంది. ఈ పండుగ సందర్భంగా బంధువులు, కొత్త అల్లుళ్లను ఇంటికి పిలిచి మర్యాదలు చేస్తారు. ఇలా ప్రతి ఇంట్లోనూ సందడి వాతావరణం నెలకొంటుంది.

వెలిగిన భోగి మంటలు

భోగి పండుగ అంటేనే.. చలి మంటలు గుర్తుకు వస్తాయి. దక్షిణాయానంలో సూర్యుడు రోజు భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దక్షిణ అర్ధగోళంలో దూరమవుతుండడంతో చలి బాగా పెరుగుతుంది. దీంతో ఆ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగభగ మండే చలి మంటలు వేసుకున్నారు. అలాగే మరో కోణంలో ఇంట్లో ఉన్న పాత వస్తువులు, విరిగిన, పాడుపడిన వాటిని ఆరుబయట వేసి ఇంటిని శుభ్రం చేసి ఇంట్లోకి లక్ష్మి రావాలని ప్రత్యేక పూజలు చేశారు. ఇంట్లోకి క్రిమికీటకాలు రాకుండా పేడతో కళ్లాపి చల్లి పిడకలను కాల్చారు. పిల్లలపై వివిధ రకాల భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. ఈ భోగి పండ్లతో ఆశీర్వదించడాన్ని స్వయంగా శ్రీమన్నారాయణుడే ఆశీర్వదించినట్టు భావిస్తారు.

భోగి పులక...

ఈ రోజు కొన్ని ప్రాంతాల్లో రైతులు తమ భూమికి ఆనవాయితీగా కొంతమేర సాగునీరు పారించి తడిచేస్తారు. ఒక పంట పూర్తయిన తదుపరి మళ్లీ పంట కోసం సాగుభూమిలో నీరు పారించడాన్ని పులకేయడం అంటారు. ఆనవాయితీగా భోగి రోజున పులకేయడాన్ని భోగిపులక అని అంటారు.

పల్లెలు, కాలనీల్లో సందడే సందడి..

సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు రోజుల ముందే బంధువులు, కుటుంబ సభ్యులు ఇండ్లకు చేరు కున్నారు. కొత్త అల్లుళ్లు ఇంటికి చేరారు. ఇంటిని పూలతో, మామిడి తోర ణాలతో అందంగా అలం కరించారు. దీంతో హిందువుల ఇండ్లలో సందడి నెలకొంది. పల్లెపల్లెనా, కాలనీల్లో సందడి సంద డి కనిపించింది. ఆర్టీసీ బస్సులు కిక్కిరిసాయి. పిల్ల లు పతంగులు ఎగురవేశారు. ఇండ్లలో పిండి వంటల తయారీతో ఇండ్లన్నీ గుమగుమలాడాయి. ఇంట్లోకి బంధువులు రావడంతో ప్రతి ఇంటిలో సందడి నెలకొంది.

నేడు సంక్రాంతి పండుగ

తెలుగు వారికి అతిపెద్ద పండుగ సంక్రాంతి. మంగళవారం ఈ పర్వదినాన్ని నిర్వహించుకోనున్నాం. ఈ రోజున సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తాడు. మకర సంక్రమణం జరిగిన రోజు కావడంతో దీనిని మకర సంక్రాంతి అని పిలుస్తారు. నెల రోజుల ముందునుంచే తెలుగువారి ఇండ్లలో పండుగ సందడి మొదలవుతుంది. అలాగే ఈ పండుగ రోజున పతంగులను ఎగురవేయడం మూలంగా పతంగుల పండుగ అనికూడా అంటారు. ఇది ప్రతి ఏడాది జనవరి 14, 15 తేదీల్లోనే వస్తుంది. ముందు రోజు భోగిగా, రెండో రోజు మకర సంక్రాంతిగా, మూడో రోజు కనుమగా, నాలుగో రోజును ముక్కనుమగా పండుగ జరుపుకుంటారు.


ఇంటిముందు ముగ్గులు వేస్తున్న మహిళలు


భూపాలపల్లిలో భోగి మంటలు

మేడారంలో మొక్కులు
మినీ జాతరకు ముందు తరలివచ్చిన భక్తులు
వనదేవతల సన్నిధిలో సందడి

వివరాలు 6వ పేజీలో...


ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు


కొత్తకొండ జాతరకు ఎడ్లబండ్లతో తరలివస్తున్న భక్తులు


ఐనవోలులో శివసత్తులు భక్తి పారవశ్యం

మల్లన్నా.. మమ్మేలు మాయన్నా..

పసుపుమయమైన ఐనవోలు మల్లన్న సన్నిధి

7

- శిగమూగిన శివసత్తులు, మోగిన ధమరుక నాదాలు
- పరవశించిన భక్తులు.. కిటకిటలాడిన పరిసరాలు
- నేడు వైభవంగా ప్రభ బండ్ల ప్రదర్శన

కోరిన వరాలిచ్చే కోరమీసాల సామి

కొత్తకొండ జాతరకు తరలివచ్చిన భక్తులు

- గుమ్మడి కాయలు, కోర మీసాల చెల్లింపులు
- కిక్కిరిసిన క్యూలైన్లు
- దర్శనానికి మూడు గంటల సమయం

7

ఘనంగా గోదాదేవి కల్యాణం

మహదేవపూర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం సోమవారం ఉదయం వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకస్వాములు గోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాశ్వత కల్యాణ దాతలకు అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, గ్రామస్థులు, భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మందరగిరి, ఎల్కేశ్వరంలో..

మహదేవపూర్ రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మందరగిరి వెంకటేశ్వర స్వామివారి ఆలయంతో పాటు ఎల్కేశ్వరం శ్రీసీతరామచంద్ర స్వామి ఆలయంలో శ్రీగోదారంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఇరు ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్ల కల్యాణాన్ని తిలకించారు. అర్చకులు నవీనాచార్యులు, వరున్‌చార్యులు, ప్రణయ్, సుప్రతిక్చాచార్యులతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బొప్పారంలో...

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిద్నెపల్లి జీపీ పరిధిలోని బొప్పారం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి, రంగనాయకుల కల్యాణం వైభవంగా జరిగింది. ధనుర్మాసం ముగింపును పురస్కరించుకుని వేదపండితుడు సముద్రాల రామాచార్యులు మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య గోదాదేవి, రంగనాయకస్వామి కల్యాన్ని కనులపండువగా

మిగతా 8వ పేజీలో...


కాళేశ్వరాలయం అనుబంధ ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కాటారం మండలం బొప్పారంలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కాళేశ్వరాలయంలో హైకోర్టు జడ్జి పూజలు



జడ్జి దంపతులకు ఆశీర్వచనం అందజేస్తున్న వేద పండితులు

మహదేవపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి రాధా రాణి దంపతులు సోమవారం మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరాలయంలో ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం సిబ్బంది జడ్జికి ఆలయ గోపురం నుంచి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ ముక్తీశ్వరస్వామి వారికి జడ్జి దంపతులు అభిషేకంతోపాటు అమ్మవారికి అర్చన చేయించారు. అనంతరం శ్రీపార్వతి అమ్మవారి ఆలయంలో దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ శేషవస్త్రాలతో జడ్జి దంపతులను సత్కరించారు.

జగత్ విఖ్యాత అవార్డు అందుకున్న విద్యార్థిని



విద్యార్థిని హర్షినిని సన్మానిస్తున్న నిర్వాహకులు

భూపాలపల్లిటౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లికి చెందిన విద్యార్థిని దుప్పటి హర్షినికి జగత్ విఖ్యాత అవార్డు లభించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఖమ్మం ఆడిటోరియంలో జరిగిన జాతీయ స్వర మాధురి కల్చరల్ ప్రోగ్రాంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో హర్షిని నృత్య ప్రదర్శన చేసి ఆహుతులను ఆకట్టుకుంది. దీంతో నిర్వాహకులు ఆ విద్యార్థినికి జగత్ విఖ్యాత అవార్డును అందజేశారు.

డబుల్ ఇళ్ల వద్ద తాగునీటి కష్టాలు



చెర్లపాలెం ఇళ్ల సమీపంలో జీపీ ట్యాంకర్ వద్ద నీరు తీసుకెళ్తున్న మహిళలు

తొర్రూరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ప్రజలు వారం రోజులుగా తాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు. గత ప్రభుత్వం పేద ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఇళ్లవద్ద తాగునీటి సౌకర్యం లేకపోవడంతో పండుగపూట తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి చెందిన కొంతమంది పెద్దలు జీపీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసి అందజేస్తున్నట్లు ప్రజలు వెల్లడిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో, బోరునీటి సౌకర్యం లేకపోవడంతో పండుగ పూట ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం ఆలోచనతోనే క్రీడల నిర్వహణ



రాష్ట్రస్థాయి మోడ్రన్ కబడ్డీలో ప్రథమ స్థానం సాధించిన సూర్యాపేట బాలికల జట్టుకు, హైదరాబాద్ బాలుర జట్టుకు ట్రోఫీలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

- ఓటమి క్రీడాకారుల్లో పట్టుదల పెంచాలి
- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

కేసముద్రం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనతోనే రాష్ట్రంలో ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, దీనికి కొనసాగింపుగా సీఎం ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి తండ్రి చెన్నకృష్ణారెడ్డి, సోదరుడు పురుషోత్తం రెడ్డిల జ్ఞాపకార్థం ఇక్కడ రాష్ట్ర స్థాయి క్రీడలను నిర్వహించారని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ అన్నారు. కేసముద్రం స్టేషన్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా వేం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడ్రన్ కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రాంచంద్రునాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టి రాష్ట్రంలోని యువత, విద్యార్థులపై ఉందని, వీరిని ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌లో ఉపాధి అవకాశాలను పెంపొందించే విధంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు గచ్చిబౌలి స్టేడియం కేంద్రంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్‌కి కేసముద్రం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉందని, ఇందులో భాగంగానే ఇక్కడ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల, మునిసిపాలిటీ మంజూరు ఇతరఅభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. క్రీడలు పోటీతత్వం, మనోధైర్యం, మానసిక వికాసం, స్నేహసంబంధాలను పెంచుతాయని తెలిపారు. ఓటమి చెందిన వారిలో మళ్లీ గెలవాలనే పట్టుదల ఉంటుందని, ఎన్నో ఇబ్బందులు పడుతూ తాను ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకొని, రాజకీయంలో రెండుసార్లు ఓడిపోయి అవమానాలు, అవహేళనలకు గురైనప్పటికీ పట్టుదలతో విజయం కోసం పోరాడి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు.

క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి..

క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని, ఇందుకు ఉదాహరణగా దక్షిణ ఆఫ్రికాలో నెల్సన్ మండేలా రగ్బీ క్రీడతో ఆ దేశ ప్రజల్లో ఐకమత్యాన్ని సాధించారని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అన్నారు. చిన్నచిన్న సమస్యలతో నేటి యువత ఆత్మహత్య చేసుకుంటున్నారని, క్రీడలు ఆడితే వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. జయాపజయాలను సమానంగా తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించడం పట్ల పోలీస్ శాఖ తరపున నిర్వాహకులను ఎస్పీ అభినందించారు. మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుంభం రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సలంజీవరెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చెడుపల్లి ఐలయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తేరాల శ్రీనివాస్, కొప్పుల శంకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

కేసముద్రం స్టేషన్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి మోడ్రన్ కబడ్డీ 17ఏళ్ల బాలికల విభాగంలో ప్రథమ స్థానం సూర్యాపేట జిల్లా జట్టు సాధించింది. ద్వితీయ నల్గొండ, తృతీయ జగిత్యాల, చతుర్థ స్థానం జనగామ జిల్లా జట్లు సాధించాయి. బాలుర విభాగంలో ప్రథమ హైదరాబాద్, ద్వితీయ నల్గొండ, తృతీయ మహబూబాబాద్, చతుర్థ స్థానం మెదక్ జిల్లా జట్లు సాధించాయి.

సీనియర్ మహిళల విభాగంలో ప్రథమస్థానం దోమల్‌గూడ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల జట్టు, ద్వితీయ జనగామ, తృతీయ మహబూబాబాద్ జట్లు, పురుషుల విభాగంలో ప్రథమ నల్గొండ, ద్వితీయ దోమల్‌గూడ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల, తృతీయ మహబూబాబాద్, చతుర్థ నిజామాబాద్ జట్లు సాధించాయి. విజేతలకు ఆహుతులు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

బస్సు ఢీకొని యువతికి గాయాలు

తొర్రూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొని యువతికి గాయాలైన సంఘటన సోమవారం తొర్రూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... తొర్రూరు ఆర్టీసీ డిపో బస్సు బస్టాండ్‌కు వెళ్తుండగా మన గ్రోమోర్ ప్రాంతంలో రోడ్డుపై పట్టణానికి చెందిన అఫ్రిన్ నడుచుకుంటూ వెళ్తుంది. ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీకొట్టడంతో యువతి కింద పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

గుర్తుతెలియని యాచకుడి మృతి



వృద్ధుడి మృతదేహం

ములుగు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కేంద్రంలోని తిరుమల థియేటర్ సమీపంలో సోమవారం గుర్తుతెలియని వృద్ధుడు మరణించాడు. రోడ్డు పక్కన మృతదేహం ఉందన్న సమాచారంతో ఘటనా స్థలికి పోలీసులు వెళ్లారు. 60-65ఏళ్ల వయసున్న ఈ వ్యక్తి కొద్ది రోజులుగా ములుగులో భిక్షాటన చేస్తూ తిరుగుతున్నట్లు తెలిసిందని ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల మార్చురీలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

18న ఉమ్మడి వరంగల్, ఖమ్మం క్రికెట్ టోర్నీ



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్

మహబూబాబాద్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 18న ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు రెడిన్ ల్యాబ్ యాజమాని లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను కలిసి మొక్కను బహూకరించి పోటీలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తోట సుభాష్, బంటి, శంకర్, రవి, భరత్, వంశీ పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ మార్కెట్ బిల్లును రద్దు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బిల్లు పత్రాలను దహనం చేస్తున్న నేతలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన వ్యవసాయ మార్కెట్ ముసాయిదా బిల్లును వెంటనే రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్నలు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఎస్‌కేఎం కన్వీనర్ గుజ్జు దేవేందర్ ఆధ్వర్యంలో ముసాయిదా బిల్లు పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన మార్కెట్ విధాన బిల్లును తీసుకువచ్చిందని తెలిపారు. ఈ బిల్లు కార్పొరేట్‌లకు లాభం చేకూర్చే విధంగా ఉందని, ఆ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెఎం నేతలు బండారి ఐలయ్య, పైండ్ల యాకయ్య, గునిగంటి రాజన్న, చింతకుంట్ల వెంకన్న, నల్లు సుధాకర్‌రెడ్డి, మేక వీరన్నలు, గుగులోతు సక్రు, యాకన్న, ఉమగాని సత్యం, తాజ్‌పాషా, తోకల వెంకన్న, రాంచంద్రు, మురళి, బిక్షం, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో ముందస్తు మొక్కులు



సమ్మక్క దేవతను దర్శించుకుంటున్న భక్తులు



గద్దెల ప్రాంగణంలో మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

మేడారం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలను దర్శించుకోవడానికి భక్తజనం సోమవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మినీ జాతరకు ముందస్తుగా తల్లులను దర్శించుకున్నారు. దీంతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి.

ముందుగా భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేశారు. పక్కనే ఉన్న కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించి గద్దెలకు చేరుకున్నారు. అనంతరం అమ్మవార్లకు చీరె, సారె, పూలు, పండ్లు, పసుపు కంకుమ, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, 20వేల మందికి పైగా భక్తులు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

భక్తుల భద్రతలో పోలీసులు

వనదేవతలను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు పోలీసులు భద్రత కల్పించారు. వాహనాలను పార్కింగ్‌లకు తరలించడం, గద్దెల వద్ద భక్తుల రద్దీ నియంత్రణ, దొంగతనాలు జరగకుండా రక్షణ కల్పించడం, పిల్లలు, వృద్ధులు, వికలాంగులకు సహాయం అందించడం తదితర చర్యలు చేపట్టారు. మొత్తం 36 మంది విధులు నిర్వర్తించారు.

గద్దెల ప్రాంగణంలో మరమ్మతులు

వనదేవతల గద్దెల ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు భక్తుల సౌకర్యార్థం పలు మరమ్మతు పనులను సోమవారం ప్రారంభించారు. మినీ జాతర నేపథ్యంలో తల్లుల దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్న దృష్ట్యా ఈ పనులను చేపడుతున్నారు.

హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్‌కు సన్మానం



తౌర్యతండాలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు

కేసముద్రం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమూద్‌పట్నం శివారు తౌర్యతండాకు చెందిన రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ చీఫ్ ఇంజనీర్ మూడావత్ చైతన్యకుమార్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. తండాలో గత పదేళ్ల క్రితం ఆయన సహకారంతో తండావాసుల ఆధ్వర్యంలో నిర్మించిన దుర్గామాత ఆలయంలో అమ్మవారి విగ్రహానికి అలంకరణ తోరణాన్ని అందించి తన మొక్కును తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఆయన్ను మాజీ సర్పంచ్ భూక్య శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, గుగులోత్ రాము, మిట్టగడుపుల యాకూబ్, జాటోత్ రమేష్, కీసర రమాదేవి, రామారపు శ్రీహరి, ముంజాల శ్రీనివాస్, భూక్య నెహ్రూ, రాంధన్, వెంకన్న, వీరన్న, భద్రు, రెడ్యా, రాంచంద్రు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

రూ.5.09 లక్షల విలువైన ఆరు బైక్‌ల స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగిలిస్తూ వాహనదారులను ఆందోళనకు గురిచేస్తున్న వ్యక్తిని సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం రామవరంనకు చెందిన ఉడుత హరీష్ అనే బైక్ మెకానిక్ 2020లో ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికెళ్లి ఆర్థికంగా నష్టపోయాడు. అప్పటి నుంచి చెడు అలవాట్లను అలవర్చుకుని డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ములుగు, స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత ఆత్మకూరు మండలంలోని హౌజ్‌బుజుర్గ్ గ్రామంలో హీరో గ్లామర్, పాలకుర్తి మండలం పెద్దతండలో టీవీఎస్ ఎక్సెల్, శివునిపల్లిలో యాక్టివా 6జి, బజాజ్ పల్సర్ 150సీసీ, 2025లో లింగాలఘణపురం మండలం చీటూరులో ప్యాషన్ ప్లస్, స్టేషన్ ఘన్‌పూర్‌లో బజాజ్ పల్సర్ 125 సీసీ, తానేదార్‌పల్లిలో బజాజ్ ఆటోలను దొంగిలించాడు.

కాగా, బాధితుల నుంచి ఫిర్యాదులు అందుకున్న వెంటనే పోలీసులు స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్‌లో పోలీసులు ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహిచండంతో బజాజ్ ఆటోలో వస్తున్న హరీష్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడంతో గతంలో చేసిన నేరాలు, దొంగతనాలను వెల్లడించి రూ.5.09లక్షల విలువైన సదరు వాహనాలను పోలీసులకు చూపించాడు. దీంతో స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసులు దొంగిలించిన వాహనాలను సీజ్ చేసిన అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్ శర్మ, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

జాతరలో తప్పిపోయిన బాలుడి అప్పగింత

భీమదేవరపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తకొండ జాతరలో సోమవా రం తప్పిపోయిన బాలుడిని పోలీసులు వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటా పూర్‌కు చెందిన కొక్కుల విష్ణు కుటుంబ సభ్యులతో వీరభద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. జాతరలో విష్ణు కుమారుడు హర్షిత్ తప్పిపోయాడు. విష్ణు వెంటనే జాతరలో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూమ్ వద్దకు వెళ్లి సమాచారం తెలిపారు. ఏసీపీ తిరుమల్, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ ఆధ్వర్యంలో వెతికి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



బాలుడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఏసీపీ తిరుమల్

హత్య కేసులో నిందితుల అరెస్టు

- ప్లాన్ ప్రకారమే మర్డర్
- ఏసీపీ నితిన్ చేతన్ వెల్లడి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నితిన్ చేతన్

జనగామ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జనగామలో కలకలం సృష్టించిన యువకుడి హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. కేసుకు సంబంధించిన వివరాలను జనగామ ఏసీపీ చేతన్ నితిన్ సోమవారం విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన బానోతు వెంకన్న(35) 15ఏళ్లుగా జనగామ రైల్వే స్టేషన్‌లో కోతులను ఆడిస్తూ, భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జనగామలోని ధర్మకంచకు చెందిన గాండ్ల సంపత్, వెంకన్నకు మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో వెంకన్నను ఎలాగైనా అంతమొందించాలని సంపత్ పన్నాగం పన్నాడు. శనివారం రాత్రి తన స్నేహితులు మహ్మద్ హైదర్, మార్క లక్ష్మణ్‌తో కలిసి వ్యూహాత్మకంగా జిల్లా కేంద్రంలోని వినాయక బార్‌లో వెంకన్నకు మద్యం తాగించారు. మద్యం మత్తులో ఉన్న వెంకన్నను బార్ వెనుక వైపు నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లి బండరాయితో ఛాతిపై మోది, కర్రతో మెడ, తలపై కొట్టి, బీరు సీసాలతో పొడిచి చంపివేశారు. మృతదేహాన్ని గుర్తు పట్టకుండా వారి వెంట తెచ్చుకున్న బైక్ నుంచి పెట్రోల్ తీసి మృతదేహాన్ని పాక్షికంగా కాల్చివేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన నర్మెట సీఐ ఎం. అబ్బయ్య, జనగామ ఎస్ఐ చెన్నకేశవులు, కానిస్టేబుళ్లను ఏసీపీ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

మల్లన్నా.. మమ్మేలుకోవన్నా..

శివమెత్తిన శివసత్తులు, ఢమరుక నాదాలు



- పరవశించిన భక్తులు
- భక్తులతో కిటకిటలాడిన ఐనవోలు పరిసరాలు
- నేడు ప్రభ బండ్ల ప్రదర్శన



ఐనవోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : శివమెత్తిన శివసత్తుల ఢమరుక నాదాలతో ఐలోని మల్లన్న దండాలు.. నన్నేలు నా తండ్రి దండాలు.. గండాలు తీరితే గండ దీపం పెడతాం.. కోరికలు నెరవేరితే కోడెలను కడుతాం.. పంటలు పండితే పట్నాలు వేస్తాం.. పిల్లజెల్ల సల్లంగా ఉంటే శేవాలు తీస్తామంటూ మల్లికార్జునస్వామి జాతరలో శివసత్తులు భక్తి పారవశ్యం పూనకాలతో చేసిన నృత్యం భక్తిని చాటాయి. మొక్కులు తీర్చేందుకు భక్తులు గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. ఒగ్గు పూజారుల ఢమరుకాల హోరు.. టెంకాయ బంధనాలు.. భోగి పర్వదినమైన సోమవారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ధర్మ, శీఘ్ర, విశిష్ట దర్శనం క్యూలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు గంటల సమయం పట్టింది. భక్తులు ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాల్లోని వ్యవసాయ భూముల్లో విడిది చేశారు. అందంగా బోనాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేసి మల్లన్నను స్తుతించారు. బోనాలపై దీపాలు వెలిగించి శివతాండవం చేస్తూ ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. మంగళవారం జరిగే మహాజాతరకు భక్తులు భారీ సంఖ్యలో రానున్నారు.

అష్టోత్తర పుష్పాలతో శివలింగానికి అలంకరణ

మల్లన్నకు ఒగ్గు పూజారులు మేలుకొలుపు చేశారు. శైవాగమ పద్ధతిలో అర్చకులు ప్రాతఃకాలంలో విఘ్నేశ్వరపూజ శైవశుద్ధి పుణ్యాహవాచనం నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంలో అర్చకులు 11 సార్లు నమ్మకం ఒకసారి చెమ్మకం చెప్పారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పండ్ల రసం, కొబ్బరి నీరు బస్మోదం (విభూది) సువర్ణోదకం, గంధోదకం, బిల్వోదకం, కుశోదకం, రుద్రకదోకంతో మంత్ర పఠనం చేసి స్వామి వారికి అభిషేకం చేశారు. అష్టోత్తర పుష్పాలతో(108) శివలింగాన్ని అలంకరించి మహానివేదన నీరాజన మంత్రపుష్పం తదుపరి తీర్థప్రసాద వితరణ చేశారు.



ఐనవోలు జాతరలో వరం పడుతున్న భక్తులు



బోనంతో శివసత్తుల విన్యాసాలు

నేడు మకర సంక్రాంతి ప్రభల బండ్ల ప్రదర్శన

మంగళవారం మకర సంక్రాంతిన మల్లన్న సన్నిధిలో ఉత్తరాన పుణ్యాకాలం, విఘ్నేశ్వరపూజ పుణ్యాహవాచనం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, మహా నివేదన పూజలు నిర్వహిస్తారు. నీరాజనమంత్ర పుష్పం తీర్థప్రసాద వితరణ, రాత్రి ప్రభల బండ్ల ప్రదర్శన, నైవేద్యంతో మార్నేని వంశీయుల దేవుడి రథం తిరుగనుంది.

దర్శించుకున్న ప్రముఖులు

వర్ధన్నపేట, భూపాలపల్లి, మేడ్చల్ ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ మేయర్ దంపతులు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.



స్వామి వారిని దర్శించుకున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



స్వామి సన్నిధిలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, మేయర్ సుధారాణి, మాజీ మేయర్ దంపతులు ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వర్‌రావు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్, ఉత్సవ కమిటీ సభ్యులు



భక్తజన సందోహం



కొత్తకొండ వీరభద్రస్వామి

మార్మోగిన వీరభద్రస్వామి నామస్మరణ

కొత్తకొండ జాతరలో భక్తుల కిటకిట

- గుమ్మడి కాయలు, కోర మీసాలు చెల్లించుకున్న భక్తులు
- కిక్కిరిసిన క్యూలైన్లు
- దర్శనానికి 3 గంటల సమయం



పల్లెరం వేస్తున్న వీరముష్టిలు

భీమదేవరపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వీరభద్రా... శరభా... శరభా.. అంటూ భక్తుల శరణుఘోషతో కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం మార్మోగింది. భక్తుల స్వామి నామస్మరణతో కొత్తకొండ పులకించిపోయింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భోగి పండుగను పురస్కరించుకుని సోమవారం భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీఘ్ర, ప్రత్యేక దర్శనం, రూ. 200, రూ. 100, రూ. 50 తో పాటు సర్వ దర్శనం ఇలా అన్ని క్యూలు కిక్కిరిసిపోయాయి. దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు వీరభద్రస్వామిని దర్శించుకుంటూనే ఉన్నారు. గుమ్మడికాయలు, కోరమీసాలు స్వామి వారికి చెల్లించేందుకు భక్తులు పోటీ పడ్డారు. రూ. 200 లైన్లు మూడు గంటల పాటు దర్శనానికి సమయం పట్టింది. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు వీరభద్ర నామస్మరణతో మార్మోగింది. పవిత్ర కోనేరులో స్నానాలాచరించిన అనంతరం పుట్టు వెంట్రుకలు అప్పజెప్పి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి బారులు తీరారు. కోరిన కోర్కెలు తీర్చాలని కోడెలను కట్టారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోరమీసాలు, గుమ్మడి కాయలు భక్తులు అప్పజెప్పారు. తమ గండాలు తొలగాలని గండా దీపంలో నూనె పోశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, దేవాదాయ శాఖ ఏసీ సునీత, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, కాజీపేట ఏసీపీ తిరుమల్, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్, వంగర ఎస్ఐలు సాయిబాబు, దివ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. భోగి కావడంతో భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల ద్వారా తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. 600 మంది పోలీసులు బందోబస్తును నిర్వహించారు. డీసీపీ సలీమా కోడె కట్టి గుమ్మడి కాయ మొక్కులు చెల్లించారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ అధికారులకు సలహాలు, సూచనలు అందించారు. ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు 50 మంది ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జాతరలో పలు సేవలందించారు. గతంలో వేలాదిగా ఇచ్చే వీఐపీ పాస్‌లు రద్దు చేయడంతో కొంత మంది భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కుమ్మరుల బోనాలతో ఎడ్లబండ్లు ప్రారంభం

ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల్లో కుమ్మరులు బోనాలను వండి ఎడ్ల బండ్లను ప్రదక్షిణలు చేసిన తర్వాత రోజు నుంచి ఎడ్లబండ్ల కార్యక్రమం జరగడం ఆనవాయితీ. దీంట్లో భాగంగా కుమ్మరులు సోమవారం బోనం గద్దె వద్ద వీరభద్రుడికి వీరబోనం చేశారు. కుమ్మరులు బోనాలను నెత్తిన పెట్టుకొని వీరభద్రుడికి ఇష్టమైన ప్రభలతో వెళ్తుండగా శివసత్తులు వీరబోనంతో గటంకుండతో నృత్యం చేశారు. వీటి వెనుక అందంగా అలంకరించిన ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కుమ్మరులు వీరభద్రుడిని దర్శించుకున్నారు. మొదటగా గద్దె వద్ద బోనం సమర్పించారు. కడిపికొండ, ఉల్లిగడ్డ దామెరకు చెందిన మహిళలు గుమ్మడికాయలను ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

భోగి సందర్భంగా ప్రత్యేక పూజలు

భోగి సందర్భంగా స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సూర్యయంత్ర ప్రతిష్టాపన, అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు, మహాన్యాసపూర్వ రుద్రాభిషేకం, పుణ్యహవచనం నిత్య బలిహరణ, అమ్మవారికి చక్రార్చన, నవావరణ పూజ చండీ హోమం నిర్వహించారు. నందీశ్వర పూజలు చేశారు. దక్షిణాయనం నుంచి సూర్య భగవానుడు ఉత్తరాయనంలోకి ప్రవేశించే సమయంలో ఎవరైతే వీరభద్రుడిని ఆరాధిస్తారో వారికి శత్రు, శరీర పీడ దరి చేరవని పురాణాలు చెబుతున్నాయి.

నేడు సంక్రాంతి బండ్ల తిరుగుట

వీరభద్రుడి ఆలయంలో మంగళవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎడ్లబండ్లు తిరుగుతాయి. కొత్తపల్లి గ్రామస్థుల రథోత్సవం జరుగుతుంది. ఎడ్ల బండ్లను అందంగా తీర్చిదిద్ది రథాలుగా కొత్తపల్లి నుంచి ఊరేగింపుగా జాతరకు వస్తారు. కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు జాతరకు ఆకర్షణగా నిలుస్తాయి.



క్యూలైన్‌లో భక్తులు



వీర బోనం ఎత్తుకున్న కుమ్మరులు



గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న డీసీపీ సలీమా

ఆద్యంతం.. ఆనందభరితం



సంక్రాంతి సంబరాలు ఊరూరా మొదలయ్యాయి. నగరాలు, పట్టణాలతోపాటు పల్లెల్లో ఈ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోనూ సంక్రాంతి శోభ సంతరించుకుంది. సోమవారం భోగి ఉండగా ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ ప్రాంగణంలో తెల్లవారుజామున భోగీ మంటలు వేసుకొని భక్తులు ఆనందోత్సవాల నడుమ ఈ పర్వదినాన్ని జరుపుకున్నారు.

- ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి)

ఘనంగా గోదావరి హారతి



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

మహదేవపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గోదావరి హారతి కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతినెల పౌర్ణమి రోజు నాడు దీనిని నిర్వహిస్తున్నారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అర్చకుడు టి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. దేవస్థానం నుంచి మంగళవాయిద్యాలు, వేద మంత్రాలతో గోదావరికి చేరుకొని హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, దేవస్థానం సిబ్బంది, కాళేశ్వరం గ్రామస్థులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



వేయిస్తంభాల ఆలయంలో క్యూ లైన్లలో భక్తులు

రుద్రేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

హనుమకొండ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శివ ప్రీతికర సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పౌర్ణమి తిథి ఆరుద్ర నక్షత్రం కలిసి వచ్చిన శుభ తరుణంతో పాటు భోగి వేళ పరమ శివుడికి అభిషేకం చేసుకుంటే ఎంతో శుభ ఫలితాలు కలుగుతాయన్న విశ్వాసంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జాతరలకు తరలి వచ్చే భక్తులు కూడా పెద్ద సంఖ్యలో ఉదయం నుంచి ఆలయానికి తరలి వచ్చి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి రుద్రేశ్వరుడిని దర్శించుకున్నారు. రుద్రేశ్వరుడికి 51 లీటర్ల ఆవుపాలు, 25 కిలోల పెరుగు, 10 కిలోల తేనె, 11 కిలోల చక్కర, 5 కిలోల ఆవు నెయ్యితో రుద్రసూక్త మూల మంత్ర పఠనంతో ప్రత్యేక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలువురు పోలీసు అధికారులు, న్యాయవాదులు, వ్యాపార వేత్తలు కూడా సోమవారం రుద్రేశ్వరుడిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ సిబ్బంది ఎస్. మధూకర్, ఎల్. రామకృష్ణ, బి. రజిత తదితరులు భక్తులకు సేవలందించారు.

ఓం నమఃశివాయ హరహర మహాదేవ..

- కన్నుల పండువగా ఆరుద్ర ద్వార దర్శనం
- శివాలయాల్లో వేకువ జామున బారులు దీరిన భక్తులు
- కిటకిటలాడిన భద్రకాళి అమ్మవారి ఆలయం

వరంగల్ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం మహాదేవుడైన పరమేశ్వరుడిని ద్వార దర్శనం ద్వారా భక్తులు దర్శించుకున్నారు. ఏటా మార్గశిర మాసంలో ఆరుద్ర నక్షత్రం రోజు బ్రహ్మ ముహూర్తంలో పరమేశ్వరుడిని దర్శించుకునే విధంగా ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేశారు. వరంగల్ నగరంలోని శ్రీరామలింగేశ్వర, ఆకారపు వారి గుడి శివాలయం, గీతాభవన్ శివాలయం, దుర్గేశ్వరాలయం, భోగేశ్వరాలయంతో పాటు శ్రీభద్రకాళి అమ్మవారి దేవస్థానంలోని తేజోలింగమైన చారిత్రక శ్రీభద్రేశ్వర స్వామిని ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక తన్మయత్వంలో ఓలలాడారు. ఓం నమః శివాయ.. హర హర మహాదేవ.. జైజై భద్రకాళి మాత.. శ్రీభద్రకాళి శరణం మమ.. అంటూ స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన గేటు వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



భద్రకాళి ఆలయంలో భక్తుల సందడి


ములుగులో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు


ఓ ఇంటి ముందు భోగి మంటలు

- భోగితో మొదలై కనుమతో ముగిసే పర్వదినం
- పల్లె లోగిళ్లల్లో ఘనం వేడుకలు
- ముగ్గులతో కళకళలాడుతున్న ముంగిళ్లు
- తీరొక్క పిండి వంటల తయారీ


చిన్నారికి భోగి పండ్లు పోస్తున్న తాత, నాయనమ్మ

సకల సంబురాల శోభ

ములుగు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గుడి మైకు సుప్రభాతం పాడంగ.. తూరుపున తొలిపొద్దు పొడువంగ.. అప్పటిదాకా కమ్ముకున్న పొగమంచు మెల్లగా పక్కకు జరుగంగ.. పేడనీళ్ల అలుకుచల్లిన ఆడబిడ్డలు వాకిట్లో వేసిన రంగురంగుల ముగ్గులు ఉదయిస్తుండగ.. చల్లని వాతావరణంలో వెచ్చని భోగి మంటలు.. కమ్మని పిండివంటలు.. గుమ్ములు నిండిన వడ్లు.. సందడి చేస్తున్న గొడ్డుగోదలు.. పతం గులు ఎగురవేస్తూ చిన్నారులు... ఆటలాడుతూ యు వత కేరింతలు.. అత్తవారింట కొత్త అల్లుల్లు, చుట్టాల సందళ్లు.. ఇష్టదైవాలను నిష్ఠగా పూజలు.. ఇదీ ప్రకృతికి ప్రాణపీటికలైన పల్లెల్లో సంక్రాంతి గీసి న చిత్రం. భోగితో మొదలై కనుమతో ముగిసే ఈ పండుగను ఊళ్లన్నీ ఘనంగా జరుపుకుంటున్నాయి. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవగా వరికోతలు పూర్తయ్యాయి. పత్తి దిగుబడి తగ్గినా మిర్చిపై ఆశలు పెంచుకున్న రైతు కుటుంబాలు నూతన క్యాలెండర్ ఇయర్‌లో జరిగే తొలి పండగను సంబురంగా చేసుకుంటున్నారు.


వాజేడులోని ఓ ఇంటి ముందు అందమైన ముగ్గు

మల్లన్నకు బోనాలు

కొమురవెల్లి మల్లన్న, ఐనవోలు మల్లికార్జున స్వామికి సంక్రాంతికి ముందు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. యాదవుల తోపాటు ఆయా సామాజికవర్గాలకు చెందిన వారు ఇంట్లోని పూజామందిరంలో దేవుళ్లకు బోనం సమర్పించి పూజలు చేశారు. బంధు మిత్రులను ఆహ్వానించి సహపంక్తి భోజనాలు చేశారు. కొత్తబియ్యంతో నైవేద్యం, బంతిపూలతో అలంకరణ ఈ బోనాల ప్రత్యేకత.

సొంతూళ్లకు పయనం..

ఉద్యోగం, ఉపాధి, చదువు కోసం సొంతూళ్లను వదిలి ఎక్కడెక్కడికో వెళ్లిన వారు సంక్రాంతి పండగకు తిరిగి వస్తు న్నారు. ఇళ్లను శుభ్రం చేసుకొని సున్నాలతో అలంకరిం చుకు న్నారు.

ఊరూరా సంక్రాంతి సందడి

ఆడబిడ్డలు తల్లిగా రిళ్లకు చేరుకు న్నారు. ఆచారం ప్రకారం కొత్త అల్లుళ్లను ఇంటికి ఆహ్వానించి కానుకలు ఇస్తున్నారు. దీంతో బస్టాండ్ల వద్ద సందడి నెలకొంది.

ఘనంగా భోగి

భోగి పర్వదినాన్ని జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారుజామున భోగి మంటలు వేసుకొని ఇంటిల్లిపాది ఆడిపాడారు.

సంతోషాలు నిండాలి : మంత్రి సీతక్క



భగవంతుని ఆశీస్సులతో రాష్ట్రంలోని ఇంటింటా సుఖ సంతోషాలు నిండాలని. పం చాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అన సూయ సీతక్క ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. దేవుని దీవెనలు, ప్రజల అభిమానంతో ప్రభు త్వం ఏడాది పాలన దిగ్విజయంగా పూర్తి చేసు కుందని, ఇందిరమ్మ ఇళ్లు, భరోసా వంటి పథ కాలతో పేదలకు అండగా నిలుస్తున్నామ న్నారు.

తూర్పు గోదావరి జిల్లాల మూలాలు ఉన్న గోవిం దరావుపేట, ఏటూరునాగారం, మంగపేట మండ లాలతోపాటు వాజేడు, వెంకటాపురం మండ లాల్లో భోగి సందడి వెల్లివిరిసింది. రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వచనాలు ఇచ్చారు.

పిండివంటల ఘుమఘుమలు

సంక్రాంతి అంటేనే పిండివంటల ప్రత్యేకం. సకి నాలు, గారెలు, మడుగూలు, అరిసెలు ఇలా తీరొక్క పిండి వంటలు తయారు చేస్తున్నారు. ఆరోగ్యానికి చలువ చేసే బియ్యం, శనగపిండి, బెల్లం, నువ్వులు, వాము విశ్రమంతో చేస్తున్న వంటలు ఘుమ ఘుమలాడుతు న్నాయి. సరుకుల కొనుగోళ్లతో కిరాణా దుకాణాలు, పిండి గిర్నిల వద్ద సందడి సందడిగా ఉంటోంది. ముగ్గులలో నింపేందుకు మహిళలు రంగులను కొనుగోలు చేస్తున్నారు.

రామప్పను సందర్శించిన జపాన్ దేశస్థులు


రామప్ప ఆలయంలో జపాన్ దేశస్థులు

వెంకటాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని సోమవారం జపాన్ దేశస్థులు సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌ను అడిగి తెలుసుకుని అబ్బురపడ్డారు. శిల్పకళా సౌందర్యాన్ని వెంట తెచ్చుకున్న కెమెరాల్లో బంధించుకున్నారు. ఆలయానికి తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా జగపతిబాబు



వాజేడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా పెద్ది జగపతిబాబును నియమించారు. భద్రాచలంలో సోమవా రం జరిగిన ఆ సమావేశంలో ఈ మేరకు ఖరారు చేశారు. ప్రస్తుతం బీజేవైఎం మండల అధ్యక్షుడిగా జగపతిబాబు పనిచేస్తుండగా బీజేపీ అధ్య క్షుడిగా ఆయన్ను నియమిం చారు. ప్రస్తుత అధ్యక్షుడిగా కందుల రామ్ కిషోర్ ప్రోత్సాహంతో తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని జగపతిబాబు తెలిపారు. అలాగే ఈ సమావే శంలో వాజేడుకు చెందిన సాగి సీతా రామరాజును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నారు.

కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి : కాంగ్రెస్

ములుగు కలెక్టరేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పట్ల అసభ్య పదజాలంతో దూషిస్తూ, గూండాగిరి చేసిన హుజూ రాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ డిమాండ్ చేశారు. ములుగులో సోమవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పెట్టిన భిక్షతో కౌశిక్ రెడ్డి రాజకీయంగా ఎదిగారనే విషయాన్ని మరచిపోవద్దన్నారు. బీఆర్ఎస్‌కు తొత్తులా మారి సొంత పార్టీ రహస్యాలను ప్రతిపక్షానికి మోసుకెళ్లిన నీచమైన వ్యక్తిత్వం ఆయనదని గుర్తుచేశారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి యాసం రవికుమార్, నాయకులు రియాజ "మీర్జా, గండె శ్రీను, పౌడాల ఓంప్రకాష్, ఓడ రాజు, జగ్గాని రఘువీర్, ఇమ్మడి రమేష్, బోయిని రాజు, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ సమస్యను పరిష్కరించాలి

గోవిందరావుపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా గ్రామంలోని 163వ జాతీయ రహదారిపై నెలరోజులుగా సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొంది రాజేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లా డారు. జాతీయ రహదారిపై లైట్లు ఏర్పాటు చేయడంలో గ్రామపం చాయతీ అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. చిన్నచిన్న గ్రామపం చాయతీల్లో ఒక్కరోజు లైట్లు లేకుంటే ప్రజల అవసరం నిమిత్తం వీధిలైట్లు ఏర్పాటు చేస్తారని, అలాంటి మేజర్ గ్రామపంచాయతీలో నెలరోజులుగా సెంట్రల్ లైటింగ్ సమస్యను పట్టించుకోకపోవడం ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యానికి అద్దంపడుతుందని అన్నారు. ఈసమస్యను అధికారులు పరి ష్కరించి సంక్రాంతి పర్వదినాన ప్రజలకు వెలుగులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసమావేశంలో మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు తీగల ఆగిరెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, కడారి నాగరాజు, సప్పిడి ఆదిరెడ్డి, అంబాల మురళి, క్యాతం సూర్యనారాయణ, ముమ్మడి ఉపేంద్రచారి, జిట్టబోయిన రమేష్, బుర్ర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లికార్జున స్వామి కల్యాణం

ఏటూరునాగారం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబే ద్కర్‌నగర్ కాలనీలోని కొమరవెల్లి మల్లికా ర్జున స్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవ వేడుకలను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు యాదవ సంఘం, కాపు సంఘం ప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తెలి పారు. మధ్యాహ్నం 2:30 గంటలకు మకర సంక్రమణ పుణ్యకాల, స్వామి వారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అమ్మఒడేలు, ఒగ్గు కళాకారుల బృందంతో పెద్దపట్నం వేయడం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


కల్యాణానికి ముస్తాబైన మల్లికార్జున స్వామి మూలవిరాట్

బీజేపీ మండల అధ్యక్షుడిగా మనోజ్



మహదేవపూర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్షుడిగా రాంశెట్టి మనోజ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఎన్నికల అధికారి అయ్యన్నగారి భూమన్న, బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, భూమయ్య, చల్లా నారాయణరెడ్డికి మనోజ్ కృతజ్ఞతలు తెలిపారు.

అన్‌సాన్‌పల్లిలో ముగ్గుల పోటీలు

మల్హర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్‌సాన్‌పల్లిలో సోమవారం మాజీ సర్పంచ్ జగన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన ధరంసోత్ అర్చన, గుగులోతు స్వాతికి, ద్వితీయ స్థానంలో నిలిచిన సాధుల కృష్ణవేణికి, మూడో స్థానంలో నిలిచిన వర్షకు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నాగుల రమేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబు ఆదేశాల మేరకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూక్య స్వప్నరఘు, నాయకులు కాసర్ల రాజయ్య, నానువల కుమార్, కుడుముల శ్రీనివాస్, దూలం సులోచన తదితరులు పాల్గొన్నారు.

1.25 లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు

కాటారం, జనవరి 13(ఆంధ్రజ్యోతి) :మండలంలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన వడ్ల కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. మండలవ్యాప్తంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో 15 కేంద్రాలు, మ్యాక్స్ ద్వారా ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ చేపట్టారు. ఈ వానాకాలంలో సరైన సమయంలో సక్రమంగా వర్షాలు కురియడం, తెగుళ్లు ఎక్కువగా లేకపోవడంతో ధాన్యం దిగుబడులు గతానికన్నా ఎక్కువగా వచ్చాయి. మండల వ్యాప్తంగా పీపీసీ(ధాన్యం కొనుగోలు కేంద్రం)ల్లో నేటివరకు సుమారు 1.25లక్షల క్వింటాళ్ల కు పైగా వడ్లు కొనుగోళ్లు చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1.15లక్షల క్వింటాళ్ల వడ్లు సేకరించగా మ్యాక్స్ కేంద్రం ద్వారా సుమారు 10 వేల క్వింటాళ్లకు పైగా సేకరించినట్లు అధికారులు తెలిపారు. విలాసాగర్, గంగారం, రేగులగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే కొద్దిగా వడ్లున్నాయని, రెండు, మూడు రోజుల్లో ధాన్యం సేకరణ ముగుస్తుందని, మిగతా పీపీసీలు మూతబడ్డాయని పీఏసీఎస్ సీఈవో సతీష్ వెల్లడించారు. ఉన్న వడ్లను వెంటనే కాంటాలు చేయాలని, వడ్ల డబ్బులు త్వరగా ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ నాగార్జునరావు

కాటారం, జనవరి 13(ఆంధ్రజ్యోతి):వాహనాల డ్రైవర్లతో పాటు ప్రజలు రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని కాటారం సీఐ నాగార్జునరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కాటారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని సుమారు 200మంది ఆటో డ్రైవర్లకు పోలీస్‌శాఖ ఆధ్వ ర్యంలో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై పలు అంశాలను అవగాహన పర్చారు. ట్రాఫిక్ రూల్స్ పాటిం చాలన్నారు. వాహనాలు ఫిట్‌గా ఉండేలా చూసుకుని, అన్ని డాక్యు మెంట్లు వెంట ఉంచుకోవాలన్నారు. సామర్థ్యానికి మించి ప్రయా ణికులను తరలించొద్దని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్సై హేమలత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు
ఆదివాసి మహిళకు ఆహ్వానం


ఆదిలక్ష్మి

మంగపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈనెల 26న జరిగే గణతంత్ర వేడుకల పరేడ్‌కు హాజర య్యేందుకు మంగపేట మండలంలోని మారుమూల గ్రామమైన పాత నిమ్మగూడేనికి చెందిన ఆదివాసీ మహిళ కొమరం ఆదిలక్ష్మికి ఆహ్వానం లభించింది. రాష్ట్రం నుంచి ఆహ్వానితులుగా కేంద్ర ప్రభుత్వం 41 మందితో జాబితాను విడుదల చేసింది. అందులో చెందిన ఆదిలక్ష్మికి కూడా స్థానం లభించింది. గిరిజన పొదుపు సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమెకు ఆహ్వానం రావడంపై హర్షం వ్యక్తమవుతోంది. యశ్వస్వీ పథకంలో భాగంగా హస్తకళలు, గ్రామీణా భివృద్ధి, ప్రధాన మంత్రి జన్‌మన్ తదితర పథకాలకు సహకరించిన వ్యక్తులను కేంద్ర ప్రభుత్వం గణతంత్ర పరేడ్‌కు ఆహ్వానిస్తోంది. ప్రత్యేకంగా ప్రధాని నరేంద్ర మోదీ వీరిని ఆహ్వానిస్తున్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలోని అటవీ గ్రామానికి చెందిన సాధారణ మహిళకు పరేడ్‌ను తిలకించే అవకాశం దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు ఇలాంటి అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని ఆదిలక్ష్మి తెలిపింది. ఇందుకు సహకరించిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సవక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)కు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

పంట చేతికొచ్చాకే
పనులు చేపట్టండి

చిన్నకాళేశ్వరం భూనిర్వాసిత రైతులు

మహదేవపూర్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నకాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మందరం చెరువు నుంచి ఎన్కపల్లి వరకు చేపట్టబోయే మెయిన్ కెనాల్ పనులను పంట చేతికొచ్చే వరకు నిలిపివేయాలని రాపల్లికోటకు చెందిన పలువురు రైతులు కోరారు. ఏపుగా ఉన్న పత్తి చేలల్లో ఇరిగేషన్ అధికారులు ఎర్రజెండాలు పాతారని, పత్తి తీసిన తర్వాతే పనులు చేపట్టాలని అన్నారు. గతంలో 2012లో చేసిన సర్వే ప్రకారం కాకుండా అదనంగా భూములను కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా గతంలో చేసిన సర్వే ప్రకారం సైతం కోల్పోతున్న భూమికి కూడా పరిహారం అందలేదని అన్నారు. ఇదిలా ఉంటే లక్ష్మీపూర్ శివారులో ఇప్పటికే పలువురి పత్తిచేల మధ్యలో నుంచి పనులు చేపట్టి పంటను ధ్వంసం చేశారని అన్నారు. పంట తీశాకే పనులు చేపట్టాలని ఈసందర్భంగా రైతులు కోరారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం


కల్యాణోత్సవంలో లక్ష్మీనరసింహారావు

ఏటూరునాగారం,జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మం డల కేంద్రంలోని శ్రీ సీతారా మచంద్ర స్వామి ఆల యంలో గోదాదేవి, రంగనా థుల కల్యాణ మహో త్సవాన్ని అంగ రంగ వైభవంగా నిర్వహిం చారు. ఆలయ ప్రధాన అర్చ కులు ఎల్లాప్రగడ నాగేశ్వ రరావు శర్మ, కృత్తిక శర్మ ఆధ్వర్యంలో ఈ మహోత్సవం జరిగింది. ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమారి లక్ష్మీనరసింహారావుతోపాటు ఆలయ కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాకులమారి ప్రదీప్ రావు, తాడూరి రఘు, అల్లి శ్రీనివాస్, మెరుగు వెంకటేశం, తాటి కృష్ణ, కాకులమారి భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపురం, బోరున ర్సాపురం, చెరుపల్లి, తిమ్మం పేట, మల్లూరు, రాజుపేట, అకినేపల్లి- మల్లారం తదితర గ్రామాల్లో వెలిసియున్న శ్రీ సీతారామామాంజనేయాస్వామి దేవాలయాలల్లో మార్గ శిర మాసంలోని దనుర్మాస ఉత్సవాలలో భాగంగా సోమవారం గోదాదేవి- మహ విష్ణువు ఉత్సవ మూర్తులకు వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

భూపాలపల్లి జిల్లాలో ఘనంగా గోదాదేవి కల్యాణం

(5వ పేజీ తరువాయి)


మందగిరి ఆలయంలో గోదాదేవి కల్యాణం

నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించగా మహిళలు మంగళ హార తులతో ఎదురేగి మొక్కులు సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు ఊర నందకిషోర్ రావు-సుసాన్, నందగోపాల్ రావు-జయచైతన్య దంపతులు భక్తులకు అన్నదానం నిర్వ హించారు. కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడి. రజిత దంపతులు కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు రవీందర్‌రావు, తోట జనార్ధన్, మాజీ సర్పంచ్ రాజమౌళి, గ్రామ పెద్దలు నర్సింగరావు, చంద్రశేఖర్‌రావు, గొడిశెల రాజయ్య, పలు గ్రామాలకు చెందిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు




వెంకటాపురంలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సీఐ కుమార్, క్రీడాకారులతో భూపాలపల్లి మండలం జంగేడు పీఏసీఎస్ చైర్మన్

వెంకటాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని స్థానిక సీఐ బండారి కుమార్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని కాఫెడ్ క్రీడా మైదానంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వెంకటాపురం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించగా సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారం భించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిలో దాడి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు, మానసికోల్లాసానికి దోహద పడతాయని అన్నారు. అనంతరం పోలీస్ టీం, మీడియా టీం ఫ్రెండ్లీ క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, జర్నలిస్టులు చారి, సంతోష్, ప్రవీణ్, అశోక్, భాస్కర్, మహేష్ సమ్మయ్య, పాషా తదితరులు పాల్గొన్నారు.

• భూపాలపల్లి కృష్ణకాలనీ, (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్ సూచించారు. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఖాశీంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండారి రవి, పోలవేణి అశోక్‌యాదవ్, బీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి పోలవేణి మహేందర్ యాదవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం, (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం బ్లూ వారియర్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్న మెంట్ సోమవారం నుంచి ప్రారంభమైంది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానంలో ఈ క్రీడాలు జరుగుతున్నాయి. జిల్లాలోని పలు మండలాలకు చెందిన గ్రామాల మొత్తం 16 జట్లు ఈ క్రీడాల్లో పాల్గొంటున్నాయి. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమారి లక్ష్మీనరసింహరావు, ఎస్సై తాజుద్దీన్ ఈ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడాలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. నేటి ఓటయే రేపటి గెలుపునకు నాంది అన్నారు. ఓటమిపాలైన క్రీడాకారులు నిరుత్సాహం చెందొద్దన్నారు. యువత చదవుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. క్రమ శిక్షణతో విద్యాభ్యానం చేస్తూనే క్రీడల్లో రాణించాలని సూచించారు. డ్రగ్స్‌ని నిర్మూలిద్ధామని, గంజాయి వంటి మత్తు పదార్థానికి దూరంగా ఉండాలని అన్నారు. ఎ. ఎవరికైనా డ్రగ్స్, గంజాయి సమచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో కళాశాల విద్యార్థులు ముందు ఉండాలని, ప్రజలను, యువకులను చైతన్యం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాకులమారి ప్రదీప్ బాబు, నిర్వాహకులు తరుణ్, సాయి, క్రీడాకారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం కొత్తూరు దేవునిగుట్ట సమీపంలో వీరంనేని నితిన్‌రావు ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయిలో శ్రీ లక్ష్మీనర్సింహ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 10వ తేదీన పోటీలు ప్రారంభం కాగా 17వరకు కొనసాగనున్నాయి. 31జట్లు తలపడుతున్నాయి. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి యువకులు వస్తున్నారు.